# సుఖాంతం

సుధాకర్‌కూ శ్రేయకూ ఆరోజు పెళ్ళిచూపులు!

సుధాకర్ శ్రేయతో ఏకాంతంగా మాట్లాడాలి అనడంతో అందరూ ఖంగుతిన్నారు. ఎంబీఏ చదివి, అమెరికా నుంచి వచ్చిన అబ్బాయి, స్ఫుర ద్రూపి, బుద్ధిమంతుడైన సుధాకర్‌ని అల్లుడిగా పొందబోతున్నామన్న ఆనందంలో వున్న శ్రేయ తల్లిదండ్రులు కూతురుకెన్నో సుద్దులు చెప్పి వారి ఏకాంతానికి ఏర్పాట్లు చేశారు.



''శ్రేయా! నన్ను గుర్తుపట్టలేదు కదా!'' మృదువుగా చిన్న స్వరంతో అడిగాడతను.

ఉలిక్కిపడిందామె. ''మీరు... నాకు ముందే తెలుసా?'' వింతగా అడిగింది శ్రేయ గుచ్చిగుచ్చి అతన్నే చూస్తూ.

''ఆ... ఏడేళ్ల క్రితం నేను డిగ్రీ ఫస్టియర్‌లో, నువ్వేమో ఇంటర్ ఫస్టియర్లో ఉండగా... నువ్వు నా ప్రేమని తిరస్కరించావని విషం తిని చచ్చి బతికిన 'సుధ'ని. గుర్తులేనా శ్రేయా?'' ఆర్ద్రంగా వుందతని గొంతు.

''ఆ.. మీరు... నువ్వు అతనివేనా?'' ఆశ్చర్యంతో కళ్లు విప్పార్చి అతన్ని తేరిపార చూస్తోందామె.

తానప్పుడేదో తేలిగ్గా తీసుకున్న సంఘటన గుర్తొచ్చిందామెకు.

★ ★ ★

హాస్పిటల్లో బెడ్‌మీద నీరసంగా పడుకుని వున్నాడతను. గండం గడిచిందన్నారు డాక్టర్లు. స్నేహితులంతా అతన్ని మూగి వున్నారు.

చైతన్య అంటున్నాడు-

''ఏరా సుధా... చచ్చి ఏం సాధిద్దామనిరా ఎలకలమందు మింగావ్? ఒకవేళ ఏదన్నా అయి వుంటే?''

అంత నీరసంలోనూ సుధాకర్ చురుగ్గా చూశాడు చైతన్యవంక.

''శ్రేయకి నా ప్రేమ విలువ తెలిసేదిరా. నా ప్రేమ ఎంత గాఢమైందో రుజువయ్యేదిరా...'' విసురుగా అన్నాడు సుధాకర్.

సుడిగాలిలా, విసురుగా చేతిలో పూలబొకేతో లోపలికొచ్చింది శ్రేయ, హైహీల్స్ టకటక చప్పుడు చేస్తూ.

వరండాలో వున్న సుధాకర్ తల్లీ తండ్రీ ఆమె వెనకే వేగంగా పరుగెత్తుకొచ్చేశారు.

''అప్పుడు రుజువయ్యేది నీ ప్రేమ కాదు, వెర్రితనం, బుద్ధిలేనితనం, జీవితం అంటే నీకున్న నిర్లక్ష్యం. అదేనాడో తెలిసింది గనకే నిన్ను కేర్ చేయలేదు నేను. ఇప్పుడు నా అభిప్రాయం సరయిందే అని రుజువైంది. ఆడపిల్ల ఇష్టపడేది జీవితాన్ని ప్రేమించే మగాడ్ని. బాధ్యత లెరిగి మసలే మగాడ్ని. ఇలా పిరికిపందలాంటి పలాయనవాదిని కాదు. ఇప్పటి వరకూ నీమీద ఎంతో కొంత సానుభూతుంటూ వుండేది. అదీ తుడిచిపెట్టుపోయిందిప్పుడు. నా పేరు మీద చావకుండా బతికి నన్నూ బతికించినందుకు నీకు నా ధన్యవాదాలివిగో...'' అంటూ చేతిలోని బొకేని అతని మీదికి విసిరేసి వచ్చినంత విసురుగానే వెళ్లిపోయింది శ్రేయ. అందరూ చేష్టలుడక్కి అలా చూస్తూండిపోయారు.

★ ★ ★

''గుర్తుంది కదూ! శ్రేయా, అనుక్షణం నిన్ను తలుచుకుంటూ నీ మాటల్ని వల్లెవేసుకుంటూ, దూరంగా వున్నా నీ గురించి ఎప్పటికప్పుడు వాకబు చేసుకుంటూ ఇన్నేళ్లూ ఓ తపస్సులా కష్టపడి చదివాను. ఇప్పుడు నిన్ను అందుకునే స్థాయికి చేరాను. నీ మెడిసిన్ చదువయ్యేదాకా ఆగాను. ఇప్పుడు పెద్దలందరి ఆమోదం వల్ల మన పెళ్లి జరగబోతోంది. అయితే నువ్వు మనస్ఫూర్తిగా ఒప్పుకుంటేనే మన పెళ్లి జరుగుతుంది. ఇందులో బలవంతం ఏమీ లేదు. అబద్ధాల పునాదుల మీద జీవితహర్మ్యాలు కట్టబోవడం అవివేకం. నువ్వు నన్ను గుర్తుపట్టలేదని గ్రహించాను. అందుకే నీకు గుర్తు చేయడం కోసమే ఈ ఏకాంతం కావాలని అడిగాను. నువ్వు అవునన్నా కాదన్నా తట్టుకోగల ఆత్మస్థైర్యం నాకుందిప్పుడు. అప్పటి పిరికివాడు కాదీ సుధాకర్. నువ్వు కాదన్నా... చచ్చిపోడులే''

మ్రాన్పడిపోయి వింటున్న శ్రేయ అప్పుడే స్పృహలోకొచ్చినట్టుగా అతని పెదాల్ని సున్నితంగా తన వేళ్లతో మూసి సిగ్గుతో తలొంచుకుంది.

''లేదు, సుధా! అప్పుడు మనది జీవితం అంటే ఏమిటో తెలిసీ తెలియని వయసు. పెద్దవాళ్లందరూ సామాన్యంగా అంటూండే మాటల్నే అనేశాను. పెద్ద ఆరిందాలా మాట్లాడాను. నేను అదెప్పుడో మర్చిపోయాను. అందుకే నిన్ను గుర్తుపట్టలేకపోయాను. ఏమైనా నా మీద నీ ప్రేమ అచంచలమైనది. నిజంగా అపూర్వం. అపురూపం కూడాను. నా మీద ప్రేమతో, ఆలోచనారహితంగా నేనన్న మాటల్తో జీవితంలో నువ్వింత పట్టుదలగా ఇంత ప్రగతిని సాధించడం అద్భుతం! నాకెంతో గర్వంగా వుందిప్పుడు. నిన్నెలా కాదనగలను చెప్పు!''

చప్పట్లు లయబద్ధంగా ఒక్కసారిగా వినిపించేసరికి మాటలాపిన శ్రేయ తను చుట్టూ వలయంలా వున్న అందర్నీ చూసి సిగ్గుగా చేతుల్లో ముఖం దాచుకుంది.

-నియాజ్ అలి
(హైదరాబాదు)